కూటమి వక్ర మార్గం!

- రోడ్డు పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం
- వేలాది మంది ప్రయాణికుల ఇబ్బందులు



వెదుళ్ల నరవ మలుపు వద్ద మధ్యలో వదిలేసిన కల్వర్టు

మాకు అధికారం ఇస్తే గుంతల్లేని రోడ్లు వేస్తాం.. సంక్రాంతిలోగా రహదారులను అభివృద్ధి చేస్తామని కూటమి నేతలు ఊదరగొట్టారు. ప్రజల కళ్లకు ఊహా చిత్రాలు చూపించి మైమరిపించారు. మొదట్లో సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అది నెరవేర్చలేకపోవడంతో.. ఆ తర్వాత ఉగాదికి కొత్త రోడ్లు వేస్తామని ప్రకటించారు. దీంతో నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతంలో కొత్త రోడ్లు వస్తాయని ఆశపడ్డారు. ఉగాది నాటికి గుంతలు పూడ్చేస్తామని హామీ ఇచ్చినా రహదారుల నిర్వహణ, మరమ్మతులపై దృష్టి సారించలేదు. కనీసం చివరిదశలో ఉన్న పనులు పూర్తి చేయకుండా వక్ర బుద్ధి చూపిస్తున్నారు. పనులు సాగదీస్తూ వేలాది మంది ప్రజలకు పరీక్ష పెడుతున్నారు.

గ్రాండ్ సాక్షి రిపోర్ట్



దువ్వాడ సెక్టార్ -1 కాలనీ వద్ద ఇరుగ్గా రహదారి

అగనంపూడి: కోట్ల ప్రజాధనంతో విస్తరించి, నిర్మించిన రహదారులు నేడు అక్కరకు రానివిగా మిగులుతున్నాయి. జీవీఎంసీ 88, 85 వార్డుల్లోని సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కల్వర్టులు మధ్యలో వదిలేయడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1 కాలనీ నుంచి కొత్తూరు, వెదుళ్లనరవ, నంగినారపాడు ఉన్నత పాఠశాల వరకు రహదారి విస్తరణ పనులు గత ప్రభుత్వం చేపట్టింది. కల్వర్టులు ఉన్నచోట మినహా అన్ని చోట్ల రహదారి నిర్మించారు. కల్వర్టులు నిర్మించే సమయానికి ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా కొత్తూరు కాలనీ నుంచి నంగినారపాడు హైస్కూల్ వరకు పెండింగ్ పనులు పూర్తి చేయలేదు. వెదుళ్లనరవ గ్రామంలోని కల్వర్టు మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన చోట్ల ఒకవైపు కల్వర్టు ఎత్తు పెంచుతూ నిర్మాణ పనులు మధ్యలో వదిలేశారు.

నిత్యం అవస్థలు

అసలే ఇరుకు రోడ్డు కావడం, ఆపైన ఒకవైపు కల్వర్టు ఎత్తు పెంచుతూ నిర్మించి రెండో వైపు గోతులు ఉండడంతో నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గాజువాక, సబ్బవరం మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన వేలాది మంది రాకపోకలకు అనువైనది. గాజువాక నుంచి సబ్బవరం వెళ్లడానికి సమీప మార్గం కావడంతో గత ప్రభుత్వం ఈ మార్గాన్ని విస్తరించింది. మూడేళ్ల కిందట నంగినారపాడు హైస్కూల్ నుంచి అమృతపురం, అసకపల్లి వెళ్లే రెండు మార్గాలను విస్తరించి రహదారులు నిర్మించారు. అజనగిరి నుంచి కొత్తూరు కాలనీ వరకు సుమారు మూడు కిలోమీటర్ల రహదారిలో కల్వర్టుల నిర్మాణం కూటమి ప్రభుత్వానికి పట్టకపోవడం విడ్డూరంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి అసంపూర్తి పనులు పూర్తి చేసి మార్గం సుగమం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



విస్తరణ పనులు నిలిచిపోవడంతో అధ్వానంగా రోడ్డు



కొత్తూరు కాలనీ వద్ద అసంపూర్తిగా కల్వర్టు పనులు

బాగు పడేనా!



జగ్గయ్యపాలెం, నరవ మొదటి బ్రిడ్జి మలుపు వద్ద రోడ్డు ఇలా..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని జగ్గయ్యపాలెం, కాపుజగ్గరాజుపేట, ఎల్ఎస్‌గార్డెన్ రోడ్డు అధ్వానంగా ఉంది. కనీసం ప్యాచ్ వర్కులు చేయలేదు. ఎక్కడపడితే అక్కడే రోడ్లపై గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు రాత్రి వేళ ప్రమాదాల బారిన పడుతున్నారు. జగ్గయ్యపాలెం నుంచి నరవ వెళ్లే మార్గంలో మొదటి బ్రిడ్జి మలుపు వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది. గోతులతో పాటు ఇసుక మట్టి చేరవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నారు. .

రోడ్డు అభివృద్ధి చేయాలి



నరవ, కాపుజగ్గరాజుపేట, ఎస్టీబీఎల్, ఎల్ఎస్ గార్డెన్స్‌తో పాటు పలు గ్రామాల వారు షీలానగర్ రావడానికి ప్రధాన రహదారి. కానీ ఇరుకు బ్రిడ్జిలు, గోతుల వల్ల రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు, పాలకులు ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు అభివృద్ధి చేయాలి.

జి.గంగా మహేష్, కాపుజగ్గరాజుపేట, లక్ష్మీ గార్డెన్స్

క్లుప్తంగా

శ్రీవారి అన్న ప్రసాదానికి విరాళం అందజేత



తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో అన్న ప్రసాద మూలనిధికి దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. షీలానగర్‌కు చెందిన శోభారాణి, అశ్విని కుమార్, గణపతి, లక్ష్మిలు రూ.25 వేలను శనివారం తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

చెట్టును ఢీకొట్టిన కారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి మార్గంలో శనివారం ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు వివరాలివి.. ఆస్పత్రి నుంచి కణితి జంక్షన్ వరకు కారు ప్రయాణిస్తోంది. మధ్యలో కారు అదుపు తప్పి అవతల రోడ్డుపైకి దూసుకెళ్లి పల్టీ కొట్టి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జయింది. కారు వెనుక భాగం పైకి లేచిపోయింది. బెలూన్లు ఓపెన్ కావడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. అయితే కారును అక్కడ విడిచి పెట్టి ప్రయాణించిన వారు వెళ్లి పోయారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1 నిర్వాసితకాలనీకి చెందిన నాలి అప్పారావు అకాల మరణం పొందడంతో ఆయన కుటుంబానికి పద్మశాలి సేవా సంఘం నాయకులు అండగా నిలిచారు. అప్పారావు కుటుంబానికి రూ.పదివేల నగదు అందించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు పప్పు రాజారావు, రాపర్తి సుబ్బారావు, కొలిపాక అప్పారావు, నీలి రాంబాబు, తెడ్లపు సతీష్, వానపల్లి జగ్గారావు, డాక్టర్ రాజు, గెద్దం గోవర్ధన్, శేసెట్టి అప్పారావు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా



క్రీడాకారులను సత్కరిస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: ఈ నెల 16 నుంచి 20 వరకు పూణేలో నిర్వహించిన 3వ జాతీయ స్థాయి కుడో మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 21 మంది క్రీడాకారులు పోటీలకు హాజరు కాగా, 11 మంది పతకాలు సాధించినట్టు కుడో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. వారిలో తొమ్మిది మంది విశాఖకు చెందినవారు ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఐదుగురు స్వర్ణ పతకాలు, ఐదుగురు కాంస్య పతకాలు, ఒకరు రజిత పతకాన్ని సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆలూరి శశిధర్, ప్రతినిధులు బి.రవిబాబు, ఎ.అనురాధ, పి.రమణ, కోచ్‌లు యశ్వంత్, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

శిశువు చికిత్స విజయవంతం



డిశ్చార్జి అనంతరం శిశువుతో తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: అప్పుడే పుట్టిన శిశువుకు ఊపిరితిత్తుల్లో తీవ్ర సమస్య తలెత్తడంతో 18 రోజుల పాటు షీలానగర్ కిమ్స్ కడల్స్ (తల్లిబిడ్డల) ఆస్పత్రిలో చికిత్స అందించినట్టు చెప్పారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన మహిళకు మధుమేహం, అధికరక్తపోటు లాంటి సమస్యలు ఉన్నాయి. దీంతో 40 వారాల తర్వాత పుట్టాల్సిన శిశువు 36 వారాలకే పుట్టాడు. పుట్టుకతోనే శ్వాశ సమస్య తలెత్తడంతో షీలానగర్ కిమ్స్‌లోని కడల్స్ ఆస్పత్రికి తరలించారు. శివవు ఊపిరితిత్తులో ఒత్తిడి తగ్గించడానికి పలు రకాల చికిత్సలు నిర్వహించి బోసినవ్వులతో బాబును డిశ్చార్జ్ చేశామని డాక్టర్ నిఖిల్ తెన్నేటి తెలిపారు.

గొందేశి ప్రభాకర్‌రెడ్డికి ఘన నివాళి

పెదగంట్యాడ: సహన శీలి.. మృదు స్వభావి.. నిరాడంబరుడు గొందేశి ప్రభాకర్‌రెడ్డి అకాల మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి పెద్ద కర్మను ఆయన స్వగృహంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, యూనియన్ల నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, ఎస్.రామారావు, కార్పొరేటర్లు, నాయకులు మద్ది శ్రీను, పిట్ట ప్రకాశ్‌రెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, దినేష్, వరప్రసాద్, గ్రామ పెద్దలు నివాళులర్పించారు..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

వెంకట రమణారెడ్డికి నివాళి

వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు గొందేశి వెంకటరమణారెడ్డి సంతాప సభను పెదగంట్యాడలోని ఆయన నివాసం వద్ద శనివారం నిర్వహించారు. స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎం.పరదేశి, ఎస్.వెంకటరమణ, అప్పారావు, పి.రెడ్డి, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎంవో డాక్టర్ ఉష

అగనంపూడి: రక్తదానం చేయడానికి యువత, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ పి. ఉష అన్నారు. అగనంపూడి ఏరియా ఆస్పత్రి, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి సంయుక్తంగా అగనంపూడి ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వార్ని ఆదుకోడానికి యువత దయార్ధ హృదయంతో ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానంపై అపోహలు విడనాడి రక్తదానం చేయాలన్నారు.వేసవికాలంలో రక్త కొరత ఉంటుందని.. దాన్ని అధిగమించడానికి శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రక్తదానం ఆవశ్యకతను వివరించడానికి సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి రక్త నిధి ఇన్‌చార్జి డాక్టర్ కె.సంతోషి రూపా, డాక్టర్ భక్తవత్సల్య, డాక్టర్ అహమ్మద్, విశాఖ లయన్స్‌క్లబ్ ఛైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కరణం సత్యారావు, సింగిడి సింహాచలం, అండిబోయిన మంగరాజు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత మొబైల్ ఫెర్టిలిటీ శిబిరం ప్రారంభం

గాజువాక: ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ ఫెర్టిలిటీ క్యాంప్‌ను విశాఖ సౌత్ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఒయాసిస్ జననీ యాత్ర పేరుతో గాజువాకలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వంశీకృష్ణ మాట్లాడుతూ సంతానోత్పత్తిపై అవగాహన పరిమితంగా ఉందన్నారు. అపోహలు కొనసాగుతున్న ప్రాంతాల్లో అవసరమైనవారికి వైద్య మార్గదర్శకత్వం అందించడం అవసరమన్నారు. దీనివల్ల అపోహలు తగ్గి సంతానోత్పత్తిని పొందే అవకాశం ఉంటుందన్నారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ రీజనల్ మెడికల్ హెడ్ డాక్టర్ రాధిక పాట్లూరి మాట్లాడుతూ సంతానలేమి అనేది ఒక వైద్య పరమైన అంశం మాత్రమే కాదన్నారు. పీసీవోడీ, తల్లిదండ్రులు కావడంలో జాప్యం, ఒత్తిళ్లువంటి వాటితో ముడిపడి ఉన్న కేసులు పెరిగిపోతున్న పరిస్థితుల్లో సత్వర డయాగ్నోసిస్ అవసరమన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లిగోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒయాసిస్ జననీ యాత్రను ప్రారంభిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

అహల్యాబాయి హోల్కర్ జీవితం ఆదర్శం



అహల్యబాయి హోల్కర్ జయంతిలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గాజువాక: మాల్వా సామ్రాజ్యపు హోల్కర్ వంశ రాణి, రాజమాత అహల్యాబాయి జయంతిని బీజేపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 71వ వార్డులోని విశ్వేశ్వరయ్యనగర్ కాలనీలోని ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ 17వ శతాబ్దంలో అహల్యాబాయి 30 ఏళ్లపాటు మరాఠా సామ్రాజ్యాన్ని పరిపాలించారన్నారు. ఆమె 240 ఆలయాలను అభివృద్ధి చేశారన్నారు. నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, దీనకొండ కృష్ణంరాజు, కట్టా పద్మ, సోంబాబు, రోహిణి, నాగేశ్వరరావు,జుల, జ్యోతి పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకూ ఉద్యమం

సీపీఎం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకూ ఉద్యమం కొనసాగుతుందని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు స్పష్టం చేశానే. కూర్మన్నపాలెం కూడలిలో కార్మికుల చేపట్టిన ఆందోళన శిబిరంలో శనివారం పాల్గొని ప్రసంగించారు. ప్రజలకోసం ప్రభుత్వాలు పనిచేయాలే తప్పా వారి కడుపు కొట్టకూడదని ఆయన హితవు పలికారు. మోదీ ప్రభుత్వం అందుకు భిన్నంగా పాలన సాగిస్తుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే ప్రభుత్వాలు ఎంతో కాలం మనుగుడ సాగించలేవన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లాశ్రీనివాసరావు ఎన్నికలు ముందు కల్లబొల్లి కబుర్లుతో కార్మికల పక్షాన ఉన్నట్టు నమ్మబలికారని విమర్శించారు. అతని మాటలు నమ్మిన ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తే పదవి వచ్చిన తర్వాత కార్మికులను విస్మరించి పెత్తందార్లకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు జగ్గునాయుడు, అయోధ్యరామ్, బైరెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు..



కార్మికులనుద్దేశించి మాట్లాడున్న సీపీఎం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

కాలువలు ఛిద్రం.. కదలని మురుగు

- దోమల దండయాత్ర
- పందుల సంచారంతో దుర్వాసన
- అవస్థలు పడుతున్న ప్రజలు



అధ్వానంగా మురుగు కాలువ

పెదగంట్యాడ: మండలంలోని పలు ప్రాంతాల్లోని కాలువలు కంపుకొడుతున్నాయి. ఎప్పటికప్పుడు కాలువల్లో చెత్తా చెదారం తొలగించకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి వస్తోంది.దీంతో కాలువలు కాస్తా పందులకు ఆవాసాలుగా మారాయి. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా నిలుస్తున్నాయి. స్థానికులు దుర్వాసన, దోమలతో సతమతమవుతున్నారు.

ఫిర్యాదు చేసినా..

అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన రావడంతో పాటు దోమలు విజృంభిస్తుండడంతో కంటి మీద కునుకు ఉండడం లేదని చెబుతున్నారు. మండలంలోని వినాయకనగర్, వుడాకాలనీ, ఎల్ఐజీ, ఎంఐజీతో పాటు నడుపూరు, హౌసింగ్ బోర్డు కాలనీ, డెయిరీ కాలనీ, బర్మా కాలనీ తదితర కాలనీల్లో ఎక్కువగా ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు నివాసం ఉంటున్నారు. ఆయా కాలనీల నుంచి జీవీఎంసీకి పన్నుల రూపంలో కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. అయితే సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. వినాయకనగర్ ప్రధాన రహదారిలో టింపనీ పాఠశాల సమీపంలో, స్మార్ట్ పక్కన, వంటిల్లు, వుడా కాలనీలోని ఏపీజీవీబీ పక్కన ప్రధాన రహదారిలో కాలువలు దెబ్బతిని అస్తవ్యస్తంగా మారాయి. శానిటరీ సిబ్బంది మొక్కుబడిగా ఎప్పుడో ఒకసారి శుభ్రం చేస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్పా సక్రమంగా చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పందులు మురుగులో తిష్టవేయడంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పేరుకుపోయిన మురుగు తొలగించి నీరు పారేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



టింపనీ పాఠశాల పక్కనే ప్రధాన రహదారిలో కాలువ పరిస్థితి



ఏపీజీవీబీ బ్యాంకు పక్కనే ప్రధాన రహదారిలో..



టింపనీ పాఠశాల పక్కనే ప్రధాన రహదారిలో కాలువ పరిస్థితి